ప్రజాశక్తి

సోమవారం 2 అక్టోబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

తొలిపరిశీలన పూర్తి



మార్పులు, చేర్పులపై మంగళగిరిలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన అధికారులు (ఫైల్)

- ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణకు ఏర్పాట్లు
- 17 నుంచి 30 వరకు అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఓటర్ల జాబితాల పరిశీలన, సవరణలకు సంబంధించి తొలివిడత పరిశీలన శనివారంతో పూర్తయింది. ప్రస్తుతం ముసాయిదా జాబితాల ప్రచురణకు అధికారులు తలమునకలై ఉన్నారు. ఈ మేరకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటి సర్వే నిర్వహించారు. బిఎల్ఓలు స్వయంగా ఇంటింటికి వెళ్లి జాబితాలను పరిశీలించారు. తరువాత అభ్యంతరాలు వ్యక్తమైన ప్రాంతాల్లో జిల్లా ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి వచ్చారు. స్థానికంగా ఉండకపోవడం, మృతి చెందిన వారి సంఖ్య ఎక్కువగా ఉండటం, రాజకీయ పార్టీల ఫిర్యాదులపై విచారణ వల్ల సెప్టెంబరు 30 వరకు పరిశీలన కొనసాగింది. సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 16 వరకు సప్లిమెంటరీ జాబితాలను రూపొందిస్తారు. అక్టోబరు 17న డ్రాఫ్టు ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రచురిస్తారు. అక్టోబరు 17 నుంచి 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అక్టోబరు 28, 29, నవంబరు 18,19 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి కొత్త ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యంతరాలు, దరఖాస్తులను డిసెంబరు 26న పరిష్కరిస్తారు. జనవరి ఒకటిన తుది జాబితా సిద్ధం చేస్తారు.

నియోజకవర్గానికి ఒక్కో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా ఉన్న రిటర్నింగ్ అధికారులు ఈసారి గ్రామస్థాయిలో ఎక్కువగా పర్యటించి క్షేత్రస్థాయిలో ఒకటికి రెండుసార్లు పరిశీలన చేశారు. 39,428 మందిని అనర్హులుగా నిర్ధారిస్తూ స్థానికంగా ఉన్న వైసిపి, టిడిపి నాయకులు ఫారం-7 దాఖలు చేశారు. తాడికొండ నుంచి అత్యధికంగా 10,921 మంది స్థానికంగా లేరన్న కారణంగా ఫారం-7 ద్వారా తొలగించాలని జాబితాలను సమర్పించారు. ప్రత్తిపాడులో 10,231 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై అధికారులు పరిశీలన చేయగా 23,505 దరఖాస్తులు తప్పుగా ఉన్నట్టు ▶ 2లో



విలేకర్లతో మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

రైతు సంఘాల ఆధ్వర్యంలో రేపు బ్లాక్‌డే

ప్రజాశక్తి-గుంటూరు

ఢిల్లీ రైతు పోరాటంలో ముగ్గురు రైతులు, ఒక విలేకరిని హత్య చేసిన వారిని శిక్షించాలని కోరుతూ మంగళవారం బ్లాక్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి హనుమంతరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి.నరసింహారావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్యనారాయణ మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్‌లో శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న రైతులపై కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు అడ్డగోలుగా వెనుకనుండి జీపుతో తొక్కించి ముగ్గురు రైతులను ఒక జర్నలిస్టును హత్య చేశారన్నారు. ఈ మారణకాండపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. మంత్రిని వెంటనే సస్పెండ్ చేయాలని, మంత్రి కుమారుడిని వెంటనే శిక్షించాలని, చనిపోయిన రైతులు, జర్నలిస్టులకు ఎక్స్‌గ్రేసియా అందించాలని డిమాండ్లతో ఆందోళన చేస్తుంటే ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈనెల మూడో తేదీన దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందని, రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జిజిహెచ్‌లో ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింతగా వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో రూ.50 లక్షలతో రెండు ఆపరేషన్ థియేటర్లు, ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రం, రక్తనిధి కేంద్రాలను కలెక్టర్ ఆదివారం ప్రారంభించారు. 104 వార్డు సమీపంలో నూతనంగా శ్రీ శారదా పీఠం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పార్కులో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అందించిన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రూ.5 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ వివరించారు.రూ.40 లక్షలతో ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన కొత్తగా యంత్ర పరికరాలను ఎపిఎంఎస్ఐడిసి ద్వారా సమకూర్చామని, ఓపీ కేంద్రం నిర్మాణానికి దాతలు సహచరించారని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. గతంలో సర్జరీల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేదని, ఇకపై ఆ పరిస్థితి ఉండదని చెప్పారు. రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మరో 11 ఓపీ కేంద్రాలనూ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు ముస్తఫా, గిరిధర్, మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్లు వనమా వజ్ర బాబు, సజీల, డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ గోవిందా నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ ▶ 2లో



ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ముమ్మరంగా వ్యాధి నిరోధక టీకాలు

- వ్యాధి రాకముందే జాగ్రత్తలు ముఖ్యం
- 16 ఏళ్లు వచ్చేవరకూ డోసులు
- ప్రజాశక్తితో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లక్ష్మానాయక్

8లో

గొప్ప మానవతావాది ఎంఎస్ స్వామినాథన్

సంస్మరణ సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు - భారతరత్న ఇవ్వాలని రైతు నాయకుల డిమాండ్

వార్తలు లోపలి పేజీల్లో



చెత్తను శుభ్రం చేస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్, కమిషనర్, ప్రజా ప్రతినిధులు

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

ప్రతి ఒక్కరూ వ్యతిగత భాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే స్వచ్ఛ నగరాలు సాధ్యమవుతాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. ఆదివారం గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బిఆర్ స్టేడియం వద్ద ఉన్న మున్సిపల్ రెడ్ ట్యాంక్ కాంప్లెక్స్‌లో స్వచ్ఛతా హి సేవ ఏక్ తారీఖ్ ఏక్ గంట శ్రమదాన్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ▶ 2లో



శంకర భారతిపురం హైస్కూల్ వద్ద రోడ్డును ఊడస్తున్న పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్

అదనపు కమిషనర్ రోజా ఆకస్మిక బదిలీ



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌వో)గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. పెద్దిరోజా స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. ప్రస్తుతం ఆమె గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ అధికారిగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించాల్సిన సమయంలో ఆమె బదిలీ ప్రాధాన్యతను సంతరించుకుంది.



కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న నాయకులు

భవశ్రీ హత్య కేసులో దోషులకు శిక్షించండి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

చిత్తూరు జిల్లాలో ఇటీవల ఇంటర్ విద్యార్థి తోకల భవ్యశ్రీపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనలో నిందితులను ఇంతవరకు అరెస్టు చేయకపోవడం శోచనీయమని రాష్ట్ర రజక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులకు అధికారపార్టీ నేతల అండదండలు ఉండటం వల్లే పోలీసులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. భవ్యశ్రీ హత్యాచారాన్ని ఖండిస్తూ ఆదివారంరాత్రి స్థానిక పాతగుంటూరు బాలాజీ నగర్ 11వ లైనులో కొవ్వొత్తులు ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై సిఐడి దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.సాంబయ్య, వి.సాంబయ్య, వి.విజయలక్ష్మి, ఎన్.మాధవిలత, ఎన్.రాంబాబు, సిహెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం వేణుగోపాలపురంలో హత్యకు గురైన భవ్యశ్రీ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు తురకా రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హత్య జరిగి 16 రోజులవుతున్నా ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవడం పోలీసుల వైఫల్యాన్ని తెలియజేస్తుందన్నారు. హత్య వెనుక ఉన్న వారిని ఎంత పలుకుబడి ఉన్న వారైనా శిక్షించాలని కోరారు. భవ్యశ్రీ హత్యపై రకరకాల కథలు అల్లుతూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. భవ్యశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలని కేంద్ర హోమ్ శాఖతో పాటు మానవ హక్కుల సంఘం ఇతర జాతీయ కమిషన్లకు సిబిఐ దర్యాప్తు కోరుతూ త్వరలో వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టి.నరసింహ, కె.కృష్ణకిషోర్, వి.పద్మ, రోజా, ఆంజనేయులు, పి.ప్రశాంత్, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు హిందీ ప్రేమీ మండలిలో గురుపీఠ పురస్కారోత్సవం

ప్రజాశక్తి - తెనాలి

గాంధీ జయంతి సందర్భంగా స్థానిక నాజర్‌పేటలోని హిందీ ప్రేమ మండలిలో సోమవారం ఉదయం 10 గంటలకు బోయపాటి నాగేశ్వరరావు, సుభద్రాదేవి గురుదంపతుల స్మృత్యోర్థం గురుపీఠ పురస్కారోత్సవం నిర్వహిస్తామని హిందీ ప్రేమ మండలి అధ్యక్షులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల హిందీ ఆధ్యాపకులు విభాగాధ్యక్షులు ప్రొఫెసర్ పిసికాటి కామేశ్వరి జయలక్ష్మి, గుంటూరు కేంద్రీయ విద్యాలయం విశ్రాంత హిందీ అధ్యాపకులు సుగ్గుల గిరిధరరావుకు హిందీ ప్రచార గురుపీట పురస్కారాలను అందిస్తున్నట్లు చెప్పారు.

జ్వరం మూడ్రోజులకు మించి ఉంటే జాగ్రత్త!



మాట్లాడుతున్న డాక్టర్ ఎం.నాగప్రదీప్

ప్రజాశక్తి-గుంటూరు

వైరల్ జ్వరాలు, షుగర్, బిపి, థైరాయిడ్ సమస్యలపై స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో కాటూరి మెడికల్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నాగప్రదీప్ మాట్లాడుతూ సాధారణంగా రుతువులు మారినపుడు ఈ వైరస్ వల్ల జ్వరాలు వస్తున్నాయని, ఈ జ్వరాలు మూడు రోజులకు మించి ఉంటే, వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు వాడుకోవాలని సూచించారు. జ్వరం వచ్చినపుడు మంచి ఆహారం తీసుకుంటూ, ఎక్కువ నీరు తాగితే మంచిదన్నారు. జులై నుండి జనవరి మధ్యలో ఫ్లూ వ్యాధి వచ్చే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తగా ప్రతి సంవత్సరం జూన్‌లో యాంటీ ఫ్లూ వ్యాక్సిన్ వేయించుకుంటే ఫ్లూ వ్యాధి బారిన పడకుండా ఉండవచని చెప్పారు. షుగర్ వ్యాధి వల్ల ముఖ్యంగా కళ్లలోని రెటీనా పొర దెబ్బతింటుందని, ఈ వ్యాధి మూలంగా న్యూరోపతి, కార్డియోమయోపతి, నెఫ్రోపతి వంటి ఆరోగ్య సమస్యలకు ఏర్పడతాయని వివరించారు. ఇటీవల కాలంలో షుగర్ లెవల్స్ బాగా హెచ్చుతగ్గులుండే వారిలో ఏ సమయంలో ఎంత శాతం ఉంటుందో తెలుసుకోవటానికి చిప్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. దానివల్ల మన శరీరంలో షుగర్ లెవల్స్ లెక్కించబడి గంట గంటకూ మన సెల్‌ఫోన్‌కు పంపిస్తుందన్నారు. ఈ వైద్యం ప్రస్తుతానికి ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ వ్యయం తగ్గితే ప్రజలకు మేలన్నారు. షుగర్ వ్యాధి అదుపులో లేకపోతే నరాలు దెబ్బతింటాయన్నారు. వారిని కనీసం ఐదు రోజులు ప్రతిరోజూ అరగంట చొప్పన వ్యాయామం చేయాలని సూచించారు. థైరాయిడ్ గురించి వివరిస్తూ శరీరంలో అన్ని అవయవాలనూ నియంత్రించే లక్షణం ఈ గ్రంధికి ఉంటుందని, సాధారణ స్థాయికి మించి పనిచేస్తే హైపర్‌థైరోడిజం అని, సాధారణం కంటే తక్కువగా పనిచేస్తే హైపోథైరాయిడిజం అంటారని వివరించారు. హైపర్ థైరాయిడిజం ఉన్న వారిలో సన్నబడటం, బరువు తగ్గడం, ఆకలి పెరగడం, ఆందోళనగా ఉండడం లాంటి లక్షణాలు ఉంటాయని, హైపోథైరాయిడిజం ఉన్నవారు నీరసంగా ఉండడం, బరువు పెరగడం, ఆకలి లేకపోవడం, జుట్టు రాలిపోవడం లాంటి లక్షణాలు కలిగి ఉంటారని చెప్పారు. సభలో సంస్థ సీనియర్ సభ్యులు వి.వి.రావ్, ప్రొఫెసర్ రత్నారావు పాల్గొనగా టి.వి.సాయిరామ్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సహకరిస్తాం

అధ్యక్షునిగా మరోసారి ఎన్నికైన ఆంజనేయులకు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్ సత్కారం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి



వర్తకులు, వ్యాపారస్తుల పాలిట ఆత్మబంధువు ఆతుకూరి ఆంజనేయులు అని శాసనమండలి సభ్యులు, లేళ్ళ అప్పిరెడ్డి కొనియాడారు. అందుకే 34 ఏళ్లుగా ఛాంబర్ అధ్యక్షులుగా ఆంజనేయులునే ఎన్నుకుంటున్నట్లు చెప్పారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడిగా రికార్డు స్థాయిలో 34వ సారి ఎన్నికైన ఆతుకూరి ఆంజనేయులుకు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరితో కలిసి ఆదివారం బ్రాడీపేటలోని ఆతుకూరి ఆంజనేయులు నివాసానికి వెళ్లిన అప్పిరెడ్డి ఆయన్ను సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా వ్యాపారుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని చెప్పారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పి.చైతన్య, గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షులు ఎస్.నరసింహారావు చౌదరి, మహేంద్ర గులేచా ఉన్నారు.



డయాలసిస్ యూనిట్ వద్ద డాక్టర్ కిరణ్‌కుమార్, నన్నపనేని వెంకయ్య చౌదరి తదితరులు

జిజిహెచ్‌లో ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆధునీకరించిన డయాలసిస్ యూనిట్ ప్రారంభం

జిజిహెచ్‌లో నెఫ్రాలజీ, డయాలసిస్ యూనిట్ రోగులకు అత్యుత్తమ సేవలు అందిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఆసుపత్రిలో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో నెఫ్రాలజీ వార్డులో డయాలసిస్ యూనిట్‌ను ఆధునికరించగా నాట్కో సంస్థ అధినేత నన్నపనేని వెంకయ్య చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నాట్కో సంస్థ అత్యాధునికంగా అద్భుతమైన డయాలసిస్ యూనిట్‌గా తీర్చిదిండ్దని చెప్పారు. నాట్కో సంస్థ రోగులకు ట్రస్ట్‌గా మారిందని, మంచి సేవలు అందిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యంత్ర పరికరాలకు నిధులు, నియామకాలు చేపట్టిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నెఫ్రాలజీ హెచ్ఒడి డాక్టర్ గొంది శివరామకృష్ణ, డాక్టర్ నిహారిక, నాట్కో వైస్‌చైర్మన్ నన్నపనేని సదాశివరావు, కో-ఆర్డినేటర్ వై.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

తొలిపరిశీలన పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు నిర్ధారించారు. దీంతో 23,505 పేర్లను జాబితాల నుంచి తొలగించకుండా చేయడంలో అధికారులు కొంత మెరుగ్గా పనిచేశారు. ఫారం-7 ద్వారా తొలగించాలని దాఖలు అయిన దరఖాస్తుల్లో మరో 13 వేలవరకు పెండింగ్‌లో పెట్టినట్టు తెలిసింది. క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలనలో జిల్లా మొత్తం మీద 44,524 మంది మృతి చెందినట్టు నిర్ధారణవగా వీరి పేర్లను జాబితాల నుంచి తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో వివరాలను అప్‌లోడ్ చేశారు. ఈ ఏడాది జనవరి నాటికి జిల్లాలో 17,11,082 మంది ఓటర్లున్నారు. తాడికొండ-1,99,465, మంగళగిరి -2,73,932, పొన్నూరు - 2,23,217, తెనాలి-2,57,889,పత్తిపాడు- 2,54,815, గుంటూరు పశ్చిమ -2,64,741, గుంటూరు తూర్పు-2,37,023 మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా కొత్తగా మరో 60 వేల మంది వరకు చేరినట్టు తెలిసింది. దీంతో పెరుగుదల స్వల్పంగా ఉండవచ్చునని భావిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత

(మొదటి పేజీ తరువాయి)

లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్, డిప్యూటీ మేయర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొని కాంప్లెక్స్ పరిసరాలను శుభ్రం చేసి, మట్టి కుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ప్రాధాన్యమిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆయా నగరాలు, గ్రామాలు స్వచ్ఛంగా మారుతాయని అన్నారు. ఒక్కరోజుకే పరిమితం కాకుండా భాధ్యతగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని కోరారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ స్వచ్ఛత పాటిస్తే మనతో పాటు మన చుట్టు ఉన్న వారి ఆరోగ్యాన్ని కూడా కాపాడిన వారమవుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలక సంఘాల్లో చెత్త తరలింపునకు ఈ-ఆటోలను అందుబాటులోకి తెచ్చారన్నారు. మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా మార్చుకోవడం ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, వార్డు సచివాలయాల వారీగా స్వచ్ఛ నగరంగా గుంటూరుని మార్చుకోవడానికి ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ త్వరలో రెడ్‌ట్యాంక్ కాంప్లెక్స్‌ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కాంప్లెక్స్‌లో రెడ్యూస్, రీ సైకిల్, రీ యూజ్ (ఆర్.ఆర్.ఆర్.)సెంటర్‌ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ప్రజలు, విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజిలా, జిఎంసి అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రైల్వే స్టేషన్ రోడ్డును స్వచ్ఛతా కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, మేయర్ తదితరులు చీపురులతో రోడ్డును శుభ్రం చశారు. గోడలపై ఉన్న పోస్టర్లను తొలగించిరంగులేశారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల గ్రామపంచాయతీ పరిధిలో శంకర భారతిపురం హైస్కూల్ వద్ద రోడ్డులో పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆధ్వర్యంలో రెండు గంటలపాటు శ్రమదానం చేశారు. రోడ్డుకిరువైపులా ఉన్న చెత్త చెదారం, పాఠశాల ఆవరణలోని చెత్త కుప్పలు, స్కూలుకు ముందు భాగంలో ఉన్న మురుగు కాల్వల్లో సిల్టులను తొలగించారు. అనంతరము కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులతో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, డిఆర్ఒ వినాయకం, డిపిఒ డాక్టర్ రమణయ్య, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ఇఒపిఆర్‌డి విజయ్‌కుమార్, పంచాయతీ అధికారి విజయ భాస్కర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి కెవిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడు ఆత్మహత్య



ప్రజాశక్తి - మాచర్ల

రెండుచింతల మండలం సత్రశాల వద్ద సిమెం ట్ ఫ్యాక్ట రీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేసే మున్నా రాజలింగం (30) పురుగు మందు తాగి ఆదివారం ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. జెట్టిపాలెంలో నివాసం ఉండే రాజలింగం ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న రాజలింగ బంధువులు అతన్ని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు రాజలింగానికి భార్య కృష్ణకుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సమస్యల కారణంగానే రాజలింగం పురుగుమందు తాగి నట్లుగా బంధువులు ఆరోపించారు. ఈ మేరకు రెంటచింతల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలాశయంలో స్నానానికి దిగి యువకుడు మృతి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

నాగార్జునసాగర్ కృష్ణవేణి పుష్కర్ ఘాట్ వద్ద స్నానానికి దిగి యువకుడు జలాశయంలో గల్లంతైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌కు చెందిన యువకుడు తోట సాయి (22) తన స్నేహి తులతో కలిసి నాగార్జున సాగర్ కి వెళ్లాడు. స్నానం చేసేం దుకు విజయపురి సౌత్ పుష్కర్ ఘాట్ వద్ద నదిలో దిగారు. నీటిలో మునిగిపోతున్న సాయిని చూసిన స్నేహితులు కేకలు వేశారు. అక్కడ ఉన్న మత్యకారులు నదిలోకి దూకి కాపాడే యత్నం చేసి నప్పటికీ అప్పటికే ఆ యువకుడు మృతి చెందాడు. పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు విజయపురిసౌత్ ఎస్ఐ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.



అక్రమార్కులకు అడ్డాగా బెల్లంకొండ మద్యం షాపులు

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండల కేంద్రమైన బెల్లంకొండ మద్యం షాపులలో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.. పేరుకే ప్రభుత్వం మద్యం షాపులు.. లోపల జరిగేదంతా కమిషన్ల వ్యవహారమే. పభుత్వ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒకటి లేదా రెండు క్వార్టర్లు ఇవ్వాలి. కానీ, క్వార్టర్ సీసాపై ఉన్న ధరపై రూ. 10 చొప్పున ఎక్కువ ఇస్తే చాలు ఎన్ని క్వార్టర్లు కావాలంటే అన్ని ఇచ్చేస్తూ రోజుకి వేల రూపాయలు దండుకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న బెల్ట్ షాపుల నిర్వాహకులకు వారి ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. అధిక ధరలకు విక్రయిస్తూ... మందు బాబుల దగ్గర నుండి డబ్బులు దోచుకుంటున్నారు.

మరి కొంతమంది గ్రామాల్లో మద్యం షాపులు తెరవకముందు బాటిల్‌పై ఉన్న రేట్ కంటే రూ.50 రూ.70 వరకు అదనంగా తీసుకుంటు న్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరు తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీరుమహ్మద్

'చట్టసభల్లో నూర్‌బాషాలకు అవకాశం కల్పించే పార్టీకి మద్దతు'

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్రంలో 20 లక్షల మంది ఉన్న నూర్‌బాషాలకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీరూమహ్మద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి బైపాస్ రోడ్డులోని రాష్ట్ర నూర్‌బాష ముస్లిమ్ సంక్షేమ సంఘం కార్యాలయంలోరాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతవరకు ఏ రాజకీయ పార్టీ నూర్‌బాషలకు ప్రాధాన్యమివ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో తమకు ఏ పార్టీ చట్టసభల్లో అవకాశం కల్పిస్తే ఆ పార్టీకి మద్దతిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ఎస్‌కె సలీమ్, డాక్టర్ బాబన్, దస్తగిరి, డి.మస్తానమ్మ, మహబూబ్ బాష, బాజీవలి, సాగూర్‌వలి, ఇమామ్‌లు పాల్గొన్నారు.

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం లో నేషనల్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక ఐలాండ్ సెంటర్ లో ఆదివారం ఏర్పాటు చేయటం జరిగింది అని తిరుమల శెట్టి ఉమా శంకర్ తెలిపారు. ఈ



శిబిరాన్ని పొన్నూరు టౌన్ సీఐ ఎండి ఖజా అల్తాఫ్ హుస్సేన్ ప్రారంభించారు సీఐ హుస్సేన్ మాట్లాడుతూ పొన్నూరులో ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తూ సర్వీస్ సంధిస్తున్న మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్ ని, వారి కార్యవర్గ సభ్యులను అభినందించారు పొన్నూరు టౌన్ ఎస్ఐ రాంబ్రహ్మం మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియపరిచారు ఈ కార్యక్రమంలో మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల శెట్టి ఉమాశంకర్ గుడివాడ పవన్ చిల్లా అనిల్ శ్రీ వెల్ఫేర్ బ్లడ్ సెంటర్ సభ్యులు నాగేశ్వరావు గారు సైదా తదితరులు పాల్గొన్నారు. రక్తదానం అన్నదానం చేయాలి అనుకునేవాళ్లు తిరుమల శెట్టి ఉమాశంకర్ 8333089722 నంబరులో సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛత కోసం శ్రమదానం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి



తెనాలిలో ఎన్‌సిసి క్యాడెట్లతో ఎమ్మెల్యే

స్వచ్ఛత సేవలో మహిళా శక్తి కనపడుతోందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి లో జగనన్న స్వచ్ఛ సంకల్పం స్వచ్ఛత సేవా కార్యక్రమం ఘనంగా జరిగింది. డాక్టర్ కిరణ్ కుమార్ నేతత్వం లో 600 మంది నర్సింగ్ విద్యార్థిని విద్యార్థులు స్వచ్ఛత సేవా కార్యక్రమం లో పాల్గొని పారిశుద్య చర్యలు చేపట్టారు. గోడలపై ఉన్న పోస్టర్లను స్టిక్కర్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. గోడలను శుభ్రం చేసి రంగులు దిద్దారు. దాదాపు రెండు గంటల పాటు శ్రమదానం చేసి రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం జరిగిన సమావేశం లో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆసుపత్రి ని పరిశుభ్రంగా శోభయానం గా తీర్చి దిద్దుతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వార్థం తో కాకుండ నిశ్వార్థం తో పని చేయాలనీ ఆయన సూచించారు. ఓ పి కి వచ్చే వారి సంఖ్య రోజు రోజు కు పెరుగుతుండటం తో కొత్త ఓ పి కేంద్రాలను ప్రారం భించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి టి కె రెడ్డి ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రావణ్ బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికురాలు మేకల శిరీషను సన్మానించారు. డిప్యూటీ సూపరిం టెండెంట్ లు డాక్టర్ డి ఎస్ ఎస్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ గోవిందా నాయక్, నర్సింగ్ సూపరింటెండెంట్ లు ఆశా సజని, కిరణ్మయి, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. గుంటూరు లోని స్థానిక జిటి రోడ్డులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టుబాకో బోర్డు నుండి స్థానిక శ్రీనివాసరావు పేటలోని రవీంద్రనాథ్ ఠాగూరు అప్పర్ ప్రైమరీ స్కూల్ వరకు పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి గణపతి నగర్ లోని ఇందిరానగర్ డాక్టర్ వైయస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో స్వచ్ఛతా కోసం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎన్యూహెచ్‌ఎం స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి హాజరయ్యారు. హెల్త్ సెంటర్ లోపల, బయట ఆవరణను అధికారులు, సిబ్బంది చీపురులతో ఊడ్చి శుభ్రపరిచారు. అనంతరం స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. తెనాలి పురపాలక సంఘం ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమాల్లో శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ విద్యార్థులు స్వచ్ఛతా కార్యక్రమాలపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.జస్వంతరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, బెల్లంకొండ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. మేడికొండూరు సచివాలయం-1 లో ఆదివారం జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మేడికొండూరు వైసిపి తాడికొండ నియోజకవర్గం సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు భక్తుల బ్రహ్మానందరెడ్డి,ఎంపీపీ ఎం.స్వప్న పాల్గొన్నారు. చేబ్రోలు మండలంలని 13 గ్రామాల్లో 26 ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆయా చోట్ల చెత్త కుప్పలు తొలగించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే కిలారి రోశయ్య, జిల్లా ఉన్నత అధికారులు పాల్గొన్నారు. చెత్తను,పిచ్చి మొక్కలను తొలిగించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ విషయాన్ని మండల పరిషత్ అభివద్ధి అధి కారి బి బాబురావు తెలిపారు. ముందుగా చేబ్రోలులో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరంప్రభుత్వ అధికారులు,సిబ్బంది, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు,ఉపాధి హామీ కూలీలు,వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులతో భారీగా మానవహారం గా ఏర్పడ్డారు.



జిజిహెచ్‌లో వృద్ధుడి మృతదేహం

ప్రజాశక్తి-గుంటూరు సిటీ

అరవై సంవత్సరాల వయసు గల వృద్ధుడు చికిత్స తీసుకుంటూ మృతి చెందిన ఘటన జి జి హెచ్ లో చోటు చేసుకుంది. కొత్తపేట సిఐ షేక్ అన్వర్ బాషా తెలిపిన వివరణ ప్రకారం చిత్తూరు జిల్లా నగరి మండలం జంగనాల కండ్రిక గ్రామానికి చెందిన సుమారు 60 సంవత్సరాల వయసు కలిగిన ముందాడి కృష్ణ (తండ్రి మునిస్వామి) శనివారం సాయంత్రం అనారోగ్య బారిన పడి జి జి హెచ్ లో చేరాడు. ఆరోజు రాత్రే చికిత్స తీసుకుంటూ మృతి చెందాడు. వృద్ధుడికి సంబం ధించిన వివరాలు లేకపోవడంతో మృతదేహాన్ని సిబ్బంది జిజిహెచ్ లోని శవాగారంలో ఉంచారు. ఈ మేరకు కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు వృద్ధుడి తరపు బంధువుల కోసం దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణ సమాచారం తెలిసినవారు 8688831320 నెంబర్ కు ఫోన్ చేయాలని చెప్పారు.

48 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి-పెదకూరపాడు

అక్రమంగా తరలిస్తున్న 48 మద్యం బాటిల్స్ ను పట్టుకున్నట్లు పెదకూరపాడు ఎస్సీబీ ఎస్సై ఫణి కుమార్ తెలిపారు. ఒక్కొక్క బాటిల్ 180 ఎంఎల్ ఉంటుందన్నారు. అమరావతి మండలం ధరణికోట గ్రామానికి చెందిన ఏసోబు ,శంకర్ నుండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బజాజ్ సిటి 100 బైక్ ని కూడా స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు.



శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వినుకొండ

శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేశారు. సత్తెనపల్లి మండలం దొర్లిపాళ్ల గ్రామానికి చెందిన కణుగుల పూజిత విద్యార్థిని ఏలూరు జిఎంసిలో ఎంబిబిఎస్ ఉచిత మెడిసిన్ సీటు సాధించింది. హాస్టల్ ఫీజు కన్నెగంట్ల కోటేశ్వరరావు సువర్చల దంపతులు విద్యార్థులు పాస్టర్ ఫీజు నిమిత్తం వినుకొండ శాంతి ఆశ్రమ ట్రస్ట్ వారు హిమాలయ గురూజీ చేతులు మీదగా రూ.5 వేలు అందజేశారు. ప్రతి నెలా రూ. 7 వేలు ట్రస్ట్ ద్వారా అందించను న్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-ఫిరంగిపురం

ఫిరంగిపురం మండలం మేరికపూడి గ్రామంలో ఆదివారం తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ వివిధ అభివద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభోత్సవం చేశారు 33 లక్షల ఎంపీ అయోధ్య రామిరెడ్డి నిధుల నుండి సిసి రోడ్లు డ్రైనేజీ కల్వర్టులు నిర్మించారు. అదేవిధంగా సచివాలయం మిల్క్ ప్లాంట్ రైతు భరోసా లకు ఏర్పాటుచేసిన కాంపౌండ్ వాల్ కూడా కత్తెర సురేష్ కుమార్ నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి తో కలిసి ప్రారంభోత్సవం చేశారు.



గోధుమపిండి ప్యాకెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

గోధుమపిండి పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి - పెదకూరపాడు

తెల్లరేషన్ కార్డులు ద్వారా నాణ్యమైన గోధుమపిండిని పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఆదివారం గోధుమపిండి పంపిణీని ప్రారంభించారు. ప్రతి తెల్ల రేషన్ కార్డుపై ఒక కిలో చొప్పున గోధుమపిండిని రూ.16కు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ నెలలో మొదటి విడతగా 30 టన్నుల గోధుమ పిండిని పంపిణీ చేస్తారన్నారు.



వయోవృద్ధులు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు

న్యాయమూర్తి శారద

ప్రజాశక్తి - మాచర్ల

వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి న్యాయస్థానాలను ఆశ్రయించి సహాయం పొందాలని సీనియర్ సివిల్ జడ్జి శారద అన్నారు. స్థానిక వివేకానంద స్టూడెంట్ హోమ్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ వృద్ధులు తమ కుటుంబ సభ్యుల నుంచి, ఆస్తి వివాదాల్లో కానీ ఏవైనా సమస్యలు ఎదుర్కొంటుంటే న్యాయ స్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలకు, వయోవృద్ధులకు వివేకానంద స్టూడెంట్ హోమ్,వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఏడుకొండలు, శ్రీనివాసరావు, అనిల్, ఉపాధ్యాయులు మాధవి, ప్రసాద్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



సీనియర్ ఓటర్లకు సన్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

అంతర్ జాతీయ సీనియర్ సిటిజన్స్ దినోత్సవం సందర్భంగా 80 సంవత్సరాలు దాటిన ఓటర్ల ను ఎన్నికల అధికారులు ఆదివారం ఘనంగా సత్కరించారు.ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం, సత్తెనపల్లి రూరల్ మండలం పరిధిలో 80 ఏళ్ల దాటిన ఓటర్లను గుర్తించి సత్తెనపల్లి తహశీల్దార్ కార్యాలయంలో వారిని సన్మానించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఆవశ్యకతను, వివరించారు. కార్యక్రమంలో ఎన్నికల ఉపతహశీల్దార్ సుజాత, సీనియర్ అసిస్టెంట్ బోసు బాబు పాల్గొన్నారు.

మాకూ.. వాహనమిత్ర అందించండి

అద్దె ఆటోలు నడిపే లైసెన్స్ ఉన్న డ్రైవర్లు, ఫైనాన్స్ ద్వారా ఆటోలు కొనుగోలు చేసిన వారి ఆవేదన

ప్రజాశక్తి-చిలకలూరిపేట



వాహనమిత్ర పథకం కింద ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఒక్కొక్కరికీ రూ.10,000 చొప్పున ప్రభుత్వం అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే, లైసెన్స్ కలిగి ఉన్న ఆటో యజమానులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తోంది. ఫైనాన్స్ ద్వారా ఆటోలు కొనుగోలు చేయడం వల్ల తమ పేరుపైకి సంబంధిత పత్రాలు ట్రాన్స్ ఫర్ కాని యజమానులు, ఆటోలపై ఆధారపడి బతికే డ్రైవర్లు తమకు ఈ పథకం ద్వారా ప్రయోజనం లేదని చిలకలూరిపేట డ్రైవర్లు వాపోతున్నారు. పట్టణంలో 1300 నుంచి 1500 వందల ఆటోలు, నియోజకవర్గం పరిధిలో (యడ్లపాడు, నాదెండ్ల) సుమారు 3 వేల వరకు ఆటోలు ఉంటాయి. ఇందులో యజమానులు, డ్రైవర్లు సుమారు 4 వేల మంది ఈ ఆటో రంగంపై ఆధారపడి జీవిస్తున్నట్లు సమాచారం.

చిలకలూరిపేట మండలంలో వాహన మిత్రపథకానికి అర్హులైన వారి సంఖ్య సుమారు ఐదు వందల నుంచి ఎనిమిది వందల వరకు ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో అయితే వెయ్యి లోపు ఉంటుంది. ఫైనాన్స్ ద్వారా ఆటోలు కొనుగోలు చేసి తమ పేర్లు ట్రాన్స్ఫర్ కాని యజమానులు, సొంత ఆటో లేని ఆటో డ్రైవర్లు తమకు కూడా ఈ పథక వర్తింపజేయాలని కోరుతున్నారు. వాహన బీమా గతంలో రూ.600 నుంచి ప్రస్తుతం రూ.900కు పెరిగిందని, ఏడాదికి ఒక పర్యాయం బ్రేక్ చేయిస్తే రూ.1500 ఉండేదని, ప్రస్తుతం రూ.2,200కు పెంచారని, పొల్యూషన్ సర్టిఫికెట్ రూ.120 నుంచి రూ.240 కు పెంచారని చెప్పారు. గతంలో లేని అదనపు చలానా లేదని కొత్తగా తీసుకొచ్చారని, దీని కింద ప్రతి ఆటోకు రూ.500 వస్తోందని అన్నారు. ఆటో సర్వీసింగ్ చేయించి, చిన్న చిన్న రిపేర్లు చేయిస్తే గతంలో రూ.600 ఇచ్చేవాళ్లమని, ఇప్పుడు రూ.1500 నుంచి రూ.1800 అవుతోందని అన్నారు. దీనికితోడు రహదారులు అధ్వానంగా ఉండటంతో టైర్లు త్వరగా దెబ్బతినడం, రోడ్లపై గుంతల్లో వాహనం నడపడం వల్ల క్లచ్ ప్లేట్స్ త్వరగా పాడైపోవడంతో ఇతరత్రా రిపేర్లు వస్తున్నాయని వాపోయారు.

గతంలో కన్నా స్పేర్ పార్ట్స్ ధరలు బాగా పెరిగిపోవడంతో వాటిని కొనుగోలు చేయడం తమకు మరింత భారంగా మారిందని చెబుతున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో ఆటోలు నడపలేని పరిస్థితి అని, పెరిగిన ధరలతో ఏమి మిగలడం లేదని అప్పులు చేయాల్సి వస్తోందని అంటున్నారు. నియోజకవర్గం పరిధిలోని ఆటోల వల్ల ఒక్క డీజిల్‌పైనే రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత ఆదాయం వస్తుందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నియోజకవర్గంలో ఉన్న అన్ని ఆటోలకు, వాటిపై ఆధారపడ్డ డ్రైవర్లకు 'వాహన మిత్ర' వర్తింపజేయాలని కోరుతున్నారు.

దేశ సంపదను దోచిపెడుతున్న మోడీ

పజాశక్తి-సత్తెనపల్లి



మాట్లాడుతున్న పెండ్యాల మహేష్

దేశ సంపద మొత్తాన్ని అదానీ,అంబానీలకు దోచిపెట్టే పనిలో ప్రధానమంత్రి మోడీ తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ విమర్శించారు. 'విద్యుత్ సంస్కరణలు-ప్రజలపై భారాలు' అనే అంశంపై ఆదివారం స్థానిక 20వ వార్డులోజరిగిన సద స్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సుకు సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అధ్యక్షత వహిం చారు. మహేష్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి దేశ సంపదను ఆదాని అంబానీలకి దోచిపెడుతున్నారని విమర్శించారు. ముఖ్యంగా విద్యుత్‌పై ఆరు రకాల పన్నులు వసూలు చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి బిల్లుకు ముఖ్యమంత్రి జగన్ అంగీకారం చెప్పడం దుర్మార్గమైన ఆలోచన అని అన్నారు. . అంబానీల కోసం ఆస్ట్రేలియా నుండి బొగ్గును అధిక ధరకు కొనుగోలు చేయడం ద్వారా ప్రజలపై భారం మోపడం సరైన నిర్ణయం కాదని అన్నారు. రైల్వేలు, బిఎస్ఎన్ఎల్, ఓడరేవులు, ఎయిర్‌పోర్టులు తదితర ప్రభుత్వ రంగ సంస్థలు అన్నీ ఆదానికి కట్టబెడుతున్నారని విమర్శించారు. మన రాష్ట్రంలోనే విశాఖ ఉక్కు పరిశ్రమ విదేశీ కంపెనీలకు అమ్మడం సరైన నిర్ణయం కాదని అన్నారు. దుర్మార్గమైన విధా నాలను ప్రజలు వ్యతిరేకించాలని, లేకుంటే భవిష్యత్తులో ప్రజలపై భారాలు ఇంకా పెరిగిపోతాయని అన్నారు. సదస్సులో అనుముల వీరబ్రహ్మం, రాజ్ కుమార్,ఆర్ పురుషోత్తం, పంతంగి ప్రభాకర్ గడ్డం సుస్లోన్ పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో జూనియర్స్ బాల,బాలికల జట్ల ఎంపిక

ప్రజాశక్తి - వినుకొండ

నరసరావుపేటలోని ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో జూనియర్స్ బాలబాలికల జట్ల ఎంపికలు ఆదివారం జరిగాయి. ఈ ఎంపికలు ఆదివారం నరసరావుపేటలోని శంకర భారతిపురం ఉన్నత పాఠశాలలో జరిగాయి. వినుకొండ గుడ్‌షెఫర్డ్ స్కూల్ నుండి విద్యార్థులు పాల్గొన్నారు. బాలుర విభాగంలోఇద్దరు విద్యార్థులు



డి.తేజ , యు.మహేష్‌లు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎం పికయ్యారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించే ందుకు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన అభినందనసభలో స్కూల్ డైరెక్టర్ డా.జి.ఇన్నారెడ్డి అభినందించారు. ఇన్నారెడ్డి మాట్లాడుతూ ఖోఖో ఆట భారతదేశ పురాతన క్రీడని తెలియజేశారు. దేహదారుఢ్యం, మేధస్సు ఉన్నవారే ఈ ఆటలో రాణించ గలుగుతారని అన్నారు. సునీత మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీ నుండి 22 వరకు చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఇక్కడ కూడా బాగా ఆడి జట్టును గెలిపించాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపా ధ్యాయులు అజీమ్, వెంకటేష్, వెంకట్, నాగరాజు లను స్కూల్ డైరెక్టర్ డా .జి ఇన్నారెడ్డి, మదన్ రెడ్డి,కిరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ జి.సునీత, అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళి

ప్రజాశక్తి - మాచర్ల

గురజాలలోని జేఆర్ఆర్ నవోదయ జూని యర్ కళాశాలలో ఎంఎస్ స్వామినాథన్ సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభకు ఆ కళాశాల ప్రిన్సిపల్ పుల్లారెడ్డి అధ్యక్షత వహించారు సమావేశంలో ఆ కళాశాల డైరెక్టర్ వెంకట్ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక



పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు కేలం ఆదినారాయణ పాల్గొన్నారు. పుల్లారెడ్డి మాట్లా డుతూ ఎంఎస్ స్వామినాథన్ కృషి వలన భారతదేశము కరువు కాటకాల నుంచి ఆహార ఉత్పత్తులు ఇతర దేశాలకు ఉత్పత్తి చేసే స్థాయికి,ఆహార ఉత్పత్తులు కొన్ని సంవత్సరాలు నిల్వ చేసే స్థాయికి ఎదిగింది అని కొనియాడారు. కళాశాల డైరెక్టర్, బోటనీ లెక్చరం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ స్వామినాథన్ చేసిన పరిశోధనలు, కొత్త రకాల వంగడాల సృష్టి మొదలైన విషయాలపై మాట్లాడారు. కేలం ఆదినారాయణ మాట్లాడుతూ స్వామినాథన్‌కు భారతరత్న, నోబెల్ బహుమతి రాకపోవటం చాలా దురదృష్టకరమని అన్నారు. **రొంపిచర్ల:** స్థానిక చెరువుకట్ట సెంటర్‌లో భగత్ సింగ్ భవన నిర్వహణ



కమిటీ ఆధ్వర్యంలో ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళు లర్పించారు. భగత్ సింగ్ భవన నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ పురోభివద్ధికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రభుత్వం వ్యవసాయం అభివృద్ధికి స్వామినాథన్ కొన్ని సూచనలు చేశారని, ప్రభుత్వాలు ఆయన సూచనలకు తిలోదకాలు ఇచ్చి కార్పోరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో నుండి ప్రగతి పథం వైపు సాగే విధంగా ఉద్యమించటమే స్వామినాథన్ కు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భగత్ సింగ్ భవన నిర్వహణ కమిటీ సభ్యులు సరికొండ రామకష్ణంరాజు, శేషం రాజు, మస్తాన్ వలి, సుబ్బరాజు, బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు పాల్గొన్నారు.

పంట కాల్వల్లో నీరుకు బదులు మురుగు పారుదల

- ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదలకు పట్టాలివ్వాలి
- తిష్టేసిన సమస్యల పరిష్కారం కోసం రేపటి నుండి సిపిఎం ప్రజాచైతన్య పాదయాత్ర
- జయప్రదం కోసం ప్రచారం, కరపత్రం ఆవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు, డి.వెంకటరెడ్డి తదితరులు



ఎమ్మెల రామయ్య కాలనీలో ప్రచారం చేస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుండి 12వ తేదీ వరకూ సిపిఎం నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కుంచనపల్లిలోని మదర్ థెరిస్సా కాలనీలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. తాడేపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో సమస్యలు తిష్టవేశాయని, ఇళ్ల స్థలాలు, రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలతో జనం ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కుంచనపల్లి ఆంధ్రరత్న పంపింగ్ స్కీం పంట కాల్వ మురుగునీటితో కలుషితమైందని, నీరుకు బదులు మురుగు పారుతుండడంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. కాల్వల పూడికతీత చేపట్టకపోవడంతో అధిక వర్షాలు పడినప్పుడు పైర్లు ముంపు బారిన పడుతున్నాయని, అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పొలాలకు సాగునీరు అందించాలని, అపార్టుమెంట్లలోని వ్యర్థపు నీరు మురుగు కాల్వల్లో కలవకుండా చూడాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ పిడబ్ల్యూడి కాల్వకట్లపైన కుంచనపల్లి పరిధిలో 300 కుటుంబాలు 30 ఏళ్ల క్రితం ఇళ్లేసుకుని నివాసం ఉంటున్నారని, వాటిని తొలగిస్తామంటూ అధికారులు నోటీసులు ఇవ్వడం అన్యాయమని అన్నారు. కాల్వకట్లపై నివాసం ఉండే పేదల ఇళ్ల స్థలాలను రెగ్యులర్ చేసి, పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. వడ్డేశ్వరంలో ఇళ్లు లేని నిరుపేదలు నివాసం ఉంటున్న ఇళ్ల స్థలాలను, కొలనుకొండలోని కొండ పోరంబోకులో ఇళ్లేసుకున్న వారికి పట్టాలివ్వాలన్నారు. మెల్లెంపూడి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల్లేక జనం ఇబ్బందులు పడుతున్నారని, పల్లంగా ఉన్న గ్రామాల్లో సిసి రోడ్ల ఎత్తు పెంచి వేయాలని, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, తాగునీరు సరఫరా చేయాలని, ప్రాతూరు, గుండిమెడ గ్రామాల్లో ఇసుక క్వారీలను తెరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అన్ని సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పాదయాత్ర చేస్తోందని, ప్రజలంతా మద్దతుగా కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి ఎ.రంగారావు, నాయకులు ఎ.రామారావు, బి.మోసే, ప్రకాష్, నాగార్జున పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

నియోజకవర్గంలో మంగళవారం నుండి జరిగే ప్రజా చైతన్య పాదయాత్రలో ప్రజలు తమ సమస్యలను యాత్ర దృష్టికి తేవాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల రామయ్య కాలనీలో ఆదివారం కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేపట్టారు. అనంతరం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. తాడేపల్లిలో ప్రధాన సమస్యగా ఉన్న ఇళ్లపట్టాల సమస్యను పరిష్కరించాలని, నివాసం ఉన్న చోటనే పట్టాలు ఇవ్వాలని, ఇంటి స్థలం లేని పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఎం ఇంటి సమీపంలో బకింగ్‌హోమ్ కెనాల్‌పై డబుల్ లైన్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా నిర్మించాలని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు డి.శ్రీనివాసకుమారి, వి.దుర్గారావు, ఎస్.ముత్యాలరావు, భాస్కరరెడ్డి, డి.కోదండరామయ్య, వెంకన్న పాల్గొన్నారు.

మరణాల్లో 30 శాతం గుండె జబ్బులే!



- తొలిసారి గుర్తించకే అధిక మరణాలు
- గ్రామాలకూ విస్తరించి పెరుగుతున్న మరణాలు
- జిజిహెచ్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీకాంత్‌కుమార్



ప్రజాశక్తి - గుంటూరు సిటి

వయసుతో నిమిత్తం లేకుండా గుండె జబ్బులు వస్తున్న నేపథ్యంలో వాటిని ముందుగానే గుర్తించడంతోపాటు మెరుగైన వైద్యం అందించేందుకు ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్.శ్రీకాంత్ కుమార్ చెప్పారు. ప్రతి మనిషీ రోజూ ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడని, మరోవైపు శారీరక శ్రమకు దూరమవుతున్నాడని చెప్పారు. శరీరానికి వ్యాయామం లేకపోవడంతోపాటు, నిద్రలేమి, మారిన ఆహారపు అలవాట్లు, ఆహార పదార్థాల్లో కల్తీల కారణంగా గుండెకు పనిభారం పెరిగి తీవ్ర ఒత్తిడికి లోనవుతోందని తెలిపారు. ఇదే గుండె జబ్బులకు దారితీస్తోందని, అందుకే చిన్నా, పెద్దా తేడా లేకుండా అనేక మంది అకాల మరణానికి గురవుతున్నారని వివరించారు. గుండె జబ్బులు గతంలో ఎక్కువగా పట్టణాలు, నగరాల్లో సంబవించగా ప్రస్తుతం గ్రామాలకూ ఈ సమస్య విస్తరించిందని, ధూమపానం, మద్యపానం వంటివీ ఇందుకు కారణమని అన్నారు.

ఈ పరిణామాలు వైద్యులనూ ఆందోళనకు గురిచేస్తున్నాయని, గుండె జబ్బులు మూడు దశాబ్దాలుగా సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయని అన్నారు. గుంటూరు నగరంలో నిత్యం మరణిస్తున్న వారిలో 30 శాతం మందికి గుండె జబ్బులే ప్రధాన కారణమని రికార్డుల ద్వారా తెలుస్తోందని వెల్లడించారు. రోగి ఏ వ్యాధితో బాధపడుతున్నాడో ముందుగా తేలుసుకోలేకపోవడం, ఆ ఒత్తిడి గుండెపై తీవ్రంగా పడి మరణాలకు దారితీస్తోందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా గుండె సంబంధిత రోగాలతో బాధపడే వారిలో 60 శాతం మంది భారతీయులే ఉండడం అత్యంత బాధాకరమన్నారు. గుండె జబ్బులకు గురైన వారు ఆర్థికంగానూ తీవ్ర ప్రతికూలతలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఒక అంచనా ప్రకారం 2005-2022 మధ్యకాలంలో 237 బిలియన్ల డాలర్ల(రూ.11850 కోట్లు)ను భారతీయులు కార్డియో వాస్కులర్ కారణంగా నష్టపోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు నిర్ధారించాయన్నారు.

95 శాతం మంది గ్రహించలేకపోతున్నారు

మొదటిసారి వచ్చే గుండెపోటును 95 శాతం మంది గ్రహించలేకపోవడమూ ప్రాణాలను హరిస్తోందని డాక్టర్ శ్రీకాంత్‌కుమార్ అన్నారు. రెండోసారి వచ్చే గుండెపోటుతో సరైన సమయానికి ఆస్పత్రులకు వచ్చేలోపు చాలామంది మరణిస్తున్నారని చెప్పారు. గుండె నొప్పికి ముందు కొన్ని లక్షణాలు గమనించాలని, ఛాతి మధ్య భాగంలో నొప్పి (మంట), చెమటలు పట్టడం, భుజం నుంచి చెయ్యి వరకు నొప్పి, బొడ్డు దగ్గర నుండి మెడ వరకు వచ్చే నొప్పులను కచ్చితంగా అనుమానించాలని, గ్యాస్ అనుకోని అజాగ్రత్త చేయొద్దని డాక్టర్ శ్రీకాంత్‌కుమార్ సూచించారు. ఇలాంటి సమస్యలుంటే గుండె పోటుగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.



గుండె జబ్బులకు జిజిహెచ్‌లో అధునాతన వైద్యం

జిజిహెచ్‌లో వారానికి మూడుసార్లు గుండెకు సంబంధించిన వైద్య పరీక్షల కోసం వైద్యులు పాత భవనంలోని 10వ నంబర్ రూమ్‌లో అందుబాటులో ఉంటారు. ఈ ఏడాది ఇప్పటివరకు 1300పైగా యాంజియోగ్రామ్, పేజ్ మేకర్, స్టంట్స్ వంటి ఆపరేషన్లు చేశారు. ఓపీ ద్వారా వచ్చే ప్రజల గుండె సమస్యలను ముందుగా గుర్తించేందుకు నెలలో 2000 పైగా 2డి ఎకో వైద్య పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తున్నారు.





వృద్ధ ఓటర్లను సన్మానిస్తున్న కలెక్టర్, నగర కమిషనర్ తదితరులు

వృద్ధ ఓటర్లకు కలెక్టర్, జెసి సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు

అర్హతున్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదై ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని, ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధ ఓటర్లను కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో సత్కరించారు. వృద్ధ ఓటర్లు సత్యవతి, ఎం.నారాయణరావు, టి.సాంబచార్య, ఎం.శ్రీనివాసులు, సి.వెంకటరత్నం, కె.ఎల్.నరిసింహారావు, పార్వతి, కొత్త నాగభూషణం తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ కల్యాణి, పశ్చిమ మండల తహశీల్దారు సాంబశివరావు, డిప్యూటీ కమిషనరు బి.శ్రీనివాస్, ఏఈఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.



మంగళగిరిలో సీనియర్ ఓటరును సత్కరిస్తున్న జెసి రాజకుమారి

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని 80 ఏళ్లు దాటిన ఇద్దరు సీనియర్ ఓటర్లను జెసి జి.రాజకుమారి ఆదివారం సత్కరించారు. పట్టణానికి చెందిన 101 ఏళ్ల దేవదానం, 80 ఏళ్ల వెంకటేశ్వరరావు ఇళ్లకు వెళ్లిన జెసి వారిని సత్కరించి మాట్లాడారు. వృద్ధులకు వీలైనంత వరకు సాయం చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ కోసం శ్రమిస్తున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.లలితను అభినందిస్తూ ప్రశంసాపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

తోపుడుబండి అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి



పట్టణంలోని మహా నాడుకు చెందిన చిరువ్యాపారి లక్ష్మణరావుకు స్థానిక వైసిపి నాయకులు తోపుడు బండి అందజేశారు. టిఫిన్ అమ్ముకుంటూ జీవనం సాగించే లక్ష్మణరావు బండి పాడైపోవడంతో స్థానిక వైసిపి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆయనకు కొత్త బండిని సమకూర్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.దుర్గారావు, 15వ సచివాలయ కన్వీనర్ సయ్యద్ సలాం, గృహ సారథులు కె.రామకృష్ణ, షఫీ, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిశుభ్రతా కార్యక్రమం



ప్రజాశక్తి-తాడేపల్లి

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్యారీ కంపెనీ రైల్వే గేటు సమీపంలోని విఘ్నేశ్వర, మణికంఠ స్వామి దేవాలయం ట్రస్టు ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో ఆదివారం పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల రోడ్లు ఊడ్చి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో బి.శ్రీనాథ్‌రెడ్డి, ఎ.నంబూద్రి, బి.సుబ్బారావు, ఎల్.నరసారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పి.వేమారెడ్డి, ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

రైతులందరికీ శాశ్వత భూహక్కు పత్రాలు

కేతిముక్కల అగ్రహారంలో 410 మంది రైతులకు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గత ప్రభుత్వాలు చేతులెత్తేసిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని వైసిపి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, రైతులకు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని కేతిముక్కల అగ్రహారంలో 410 మంది రైతులకు వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూరక్ష (రీ-సర్వే) పత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వందేళ్ల తర్వాత దేశంలో తొలిసారిగా చేపట్టిన సమగ్ర భూ-రీసర్వేలో భాగంగా అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ప్రతి కమతానికి నంబర్ ఇచ్చేందుకు పత్రాలు పంపిణీ చేశామన్నారు.

రాష్ట్రంలో భూ వివాదాలన్నింటికి చెక్ పెట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని , భూమి కలిగిన ప్రతీ ఒక్కరికీ శాశ్వత హక్కుదారు ఇచ్చేలా పథకం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. హద్దు రాళ్ల పాతి రైతులకు భూహక్కు పత్రం ఇవ్వబోతున్నట్లు చెప్పారు. సరైన వ్యవస్థ లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని పరిస్థితులు మార్చాలని ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80 శాతం నుంచి 90 శాతం సివిల్ కేసులు భూములకు సంబంధించినవే ఉన్నాయని, రికార్డులు సరిగా లేకపోవడం, మ్యూటేషన్ సరిగా లేకపోవ డం వల్ల సమస్యలు ఎదురవు తున్నట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ అత్యాధునిక సర్వే సాంకేతికతలను ఉపయోగించి ఈ సమగ్ర రీసర్వేను చేస్తున్నట్లు చెప్పారు. భూహక్కు పత్రం అందించడం ద్వారా భూ యజమానులకు హక్కు భద్రత కల్పించడం, 5 సెంమీ లేదా అంత కంటే తక్కువ కచ్చితత్వంతో జియో-రిఫరెన్స్ కోఆర్డినేట్ల ఆధారంగా భూ రక్ష సర్వే రాళ్లను నాటడం ద్వారా భూమికి భౌతిక భద్రత కల్పించడం ఈ సమగ్ర సర్వే ప్రధాన లక్ష్యాలని అన్నారు. ప్రతి భూ కమతానికి విడిగా అక్షాంశ, రేఖాంశాలు, విశిష్ట గుర్తింపు సంఖ్య, సమగ్రంగా భూవివరాలు తెలిపే క్యూఆర్ కోడ్‌తో కూడిన భూకమత పటం భూ యజమానులకు జారీ చేస్తామని తెలిపారు.

సింగిల్ విండో పద్దతిలో ప్రతి ఆస్తికీ ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత భూ హక్కు పత్రం జారీ చేసే దిశగా భూ లావాదేవీలు, బ్యాంకు రుణాలు ఇకపై సులభతరమవుతాయని అన్నారు. ప్రతి భూకమతానికి ఉచితంగా భూరక్ష హద్దు రాళ్ళు ఇవ్వడంతో పాటుగా, డూప్లికేట్ రిజిస్ట్రేషన్లకు ఇక చెక్ పెడతామని చెప్పారు. సర్వే ప్రతి అడుగులో భూ యజమానుల భాగ స్వామ్యం చేయడం, మండల మొబైల్ మెజిస్ట్రేట్ బృందాల ద్వారా అభ్యంతరాల పరిష్కారం తొలిసారిగా గ్రామ కంఠాల్లోని స్థిరాస్తుల సర్వే, యాజమాన్య ధ్రువీకరణ పత్రాల జారీ చేస్తామని నరసరావుపేట ఆర్డీవో ఎం.శేషిరెడ్డి అన్నారు. అధికారులు స్థానిక నాయకులు, రైతులు అందరి సమిష్టి కృషి వల్ల సాధ్యమైందన్నారు. అనంతరం కేతముక్కల అగ్రహారం సర్వేయర్, విఆర్ఒలను జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణ నాయక్,జడ్పిటిసి పి.చిట్టిబాబు,ఎంపిపి మూర బోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మహిళా రైతుకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే



వెబ్‌ఎక్స్ మీటింగ్ ద్వారా 'ఆరోగ్య సురక్ష '

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎస్ ఆర్ శంకరన్ కార్యాలయంలో వెబ్‌ఎక్స్ మీటింగ్ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష పై అవగాహన కల్పించారు. అవసరమైన ఏడు రకాల ఆరోగ్య పరమైన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ, ఇతర శాఖ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. నిర్దేశిత సమయం నుండి వైద్య నిపుణులు విధుల్లో తప్పని సరిగా పాల్గొనేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ, ట్రైన్ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని కోట సెంటర్ వంగవీటి రంగా విగ్రహం వద్ద ఇటీవల విద్యుత్ షాక్ తో మృతి చెందిన చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన మిరియాల గణేష్ (11) కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పరామర్శించారు. కాకుమాను బజార్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మృతుడు గణేష్ తల్లికి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. గణేష్ కుటుంబ సభ్యులకు ఇంటి స్థలం కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, 1వ వార్డు ఇన్‌ఛార్జిలు, వడ్డెర సంఘం పెద్దలు, కాకుమాను బజార్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి - వినుకొండ

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి204 ఏ లోని రీజియన్ 2 రీజియన్ కాన్ఫరెన్స్ ఆదివారం వినుకొండ పట్టణంలోని కేజీ ఎల్ కన్వెన్షన్‌లో గుడిపాటి రీజియన్ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కనమర్లపూడి హరి ప్రసాద్ హాజరై మాట్లాడుతూ వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది కొన్ని కోట్ల రూపాయల సేవా కార్యక్రమాలకు నిర్వహిస్తున్నామని, విసిఐ ద్వారా వాసవియన్లకు వివిధ పథకాలను అందిస్తున్నామని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రీజియన్ చైర్మన్ జివిఎల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది కాలం పాటు తన రీజియన్ లో వివిధ క్లబ్స్ సంవత్సర కాలం పాటు చేసిన సేవలకు గాను అవార్డు అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ క్లబ్స్ కు వివిధ విభాగాలలో పలు అవార్డ్స్ అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ పొగ్రాం కో ఆర్డినేటర్ టి.నాగ మల్లేశ్వరరావు, జి.నాగ పవన్ కుమార్, జిల్లా వైస్ గవర్నర్ కె. శివ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంలోనే ప్రజారోగ్యం దాగుంది

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

పచ్చదనం, పరిశుభ్రతలోనే ప్రజారోగ్యం దాగుందని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఏరియా వైద్యశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం ప్రతి ఒక్కరికీ బాధ్యతగా గుర్తించాలని అన్నారు. ముఖ్యంగా ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. ఈ సందర్భముగా ఆయన సిబ్బందితో కలిసి ఆసుపత్రి పరి సరాలలో వున్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు సాంబశివరావు, నాగుల్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్ , వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. **సత్తెనపల్లి రూరల్:** రైల్వే బోగీలను, స్టేషన్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్టేషన్ సూపరింటెండెంట్ కె. వెంకటరెడ్డి ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్య క్రమంలో భాగంగా సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో పరిసరాల పరి శుభ్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రైల్వే సిబ్బంది స్టేషన్ ప్రాంగణాన్ని శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొల గించారు. **పెదకూరపాడు:** ప్రజలు తమ ఇంటి పరిసరాలను, ప్రభుత్వ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెదకూరపాడు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి కోరారు. పెదకూరపాడు లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో, వాటర్ ట్యాంకు పరిసర ప్రాంతాల్లో గడ్డిని పిచ్చి మొక్కలను పీకారు. **రొంపిచర్ల:** మండలంలో అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు ఒక గంట పాటు గ్రామాలలో స్వచ్ఛతే సేవ కార్యక్రమం జరిగింది. తొలుత స్వచ్ఛతే సేవ ప్రతిజ్ఞ చేసి పారిశుధ్య పనులు చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛతే సేవ ప్రతిజ్ఞ చేశారు. **విజయపురిసౌత్:** పరిసరాల పరిశుభ్రత స్వచ్ఛత మనందరి బాధ్యత అని మాచర్ల మున్సిపల్ కమిషనర్ వివి రమణబాబు, చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు అన్నారు. మాచర్లపురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత లీగ్ 2.0లో భాగముగా ఏక్ తారీకే ఏక్ గంట కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ రమణ బాబు, చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు ఆధ్వర్యంలో అంబేద్కర్ పార్క్ సెంటర్ నుండి ఆర్టీసీ బస్ స్టాండ్ వరకు శ్రమదానం కార్యక్రమం నిర్వ హించారు. 'ఏక్ తారీకే ఏక్ గంట'లో భాగముగా కిడ్స్ పాఠ శాల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, అర్బన్ హెల్త్ సెంటర్లలో, పట్టణంలోని వివిధ వార్డులలో పరిసరాలను పరిశుభ్రం చేశారు.


పిచ్చి మొక్కలను తొలగిస్తున్న మంత్రి అంబటి రాంబాబు





కూచిపూడి, భరతనాట్యంతో ఏకాగ్రత

ప్రజాశక్తి - వినుకొండ

కూచిపూడి, భరతనాట్యం విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల, ధైర్యాన్ని పెంపొందిస్తుందని వినుకొండ పట్టణ సిఐ సాంబశివరావు అన్నారు. బెజవాడ చారిటబుల్ ట్రస్ట్, లిటిల్ బాక్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి భరతనాట్యం వేడుకలు పట్టణంలోని తారకరామ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి సిఐ సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి బయటకు తీసుకురావడం గొప్ప విషయం అన్నారు. ట్రస్ట్ చైర్మన్ బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు జాతీయ నంది పురస్కారాలు ఐరావత పుర స్కారాలు, జాతీయ మయూరి పురస్కారాలు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 60 మంది బాలబాలికలు సాధించినట్లు తెలిపారు. భరతనాట్యం



నిపుణురాలు పువ్వాడ ప్రతిమ సునీల్ కుమార్ మాట్లాడారు.కార్యక్రమంలో నాగమణి,నాగేంద్రబాబు, వంశీకృష్ణ, చంద్రశేఖర్, చాంద్‌బాషా, నాగేంద్రుడు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు

7 లోపు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గుర్తింపుకార్డులు కావాల్సిన జిల్లాలోని కళాకారులు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబం ధాల శాఖాధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ నిర్ణయించిందని తెలిపారు. వివిధ కళా రంగాల్లో ఉన్న కళాకారులు గుర్తింపుకార్డు కోసం నిర్ణీత తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, ఆర్టీసీ బస్టాండ్ వెనుక ప్రకాష్ నగర్, నరసరావుపేట కు పంపాలని కోరారు. దరఖాస్తుల కోసం 9618607464 నంబరులో సంప్రదించాలని కోరారు.

గొప్ప మానవతావాది స్వామినాథన్

సంస్మరణ సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు - భారతరత్న ఇవ్వాలని రైతు నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్ గొప్ప మానవతావాది అని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. జెవివి ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సభ నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో ప్రజలు ఆకలితో చనిపోయే పరిస్థితుల్ని చూసి చలించిపోయి, వ్యవసాయ శాస్త్రవేత్తగా అనేక అధిక దిగుబడులిచ్చే వంగడాలను కనుగొన్నారని, నేడు ఆహార పదార్థాలు మిగులు స్థాయికి తీసుకురావటానికి ఆయన చేసిన కృషి అమోఘమని చెప్పారు. ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు మాట్లాడుతూ ఎం.ఎస్.స్వామినాథన్ శాస్త్రవేత్తగా పరిశోధనలు చేయటమే కాకుండా రైతుల సమస్యలపై విశేష అధ్యయనం చేశారని, పంటల మద్దతు ధరకు, మహిళా రైతుల సమస్యలపై, ఆహార భద్రత చట్టం కోసం కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు వివికె.సురేష్, డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్, బి.ప్రసాద్, నేతాజి, పి.వెంకటేశ్వరరావు, సిహెచ్.ఆదినారాయణ, బి.ఉదయభాస్కర్, ఎస్ఎం సుభాని, జి.వెంకటరావు, బి.శంకర్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలని రైతు నాయకులు కోరారు. స్వామినాథన్ సంస్మరణ సభ స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి అఖిలపక్ష రైతు సంఘం నాయకులు కె.హరిబాబు అధ్యక్షత వహించగా కౌలురైతు సంఘం మండల కార్యదర్శి కె.శివనాగేశ్వరరావు, తెలుగు రైతు నాయకులు ఆర్.శివరామకృష్ణయ్య, సిఐటియు నాయకులు కె.నాగేశ్వరరావు, ఎస్‌టియు నాయకులు జి.మోహన్‌రావు, రైతు సంఘం నాయకులు బి.శంకరయ్య మాట్లాడారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయడం ద్వారా ప్రభుత్వాలు ఆయన మృతికి నివాళులర్పించాలన్నారు. స్వామినాథన్ సూచించిన సి2 ప్లస్ 50 శాతం ఫార్ములాను అమలు చేస్తే దేశంలో రైతులకు మనుగడ సాధ్యమవుతుందని చెప్పారు. గుంటూరు ఛానల్ విస్తరణ పూర్తయితే ఈ ప్రాంత రైతుల కష్టాలు తీరతాయని దీర్ఘకాలికంగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా రైతులకు కేంద్రం ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. తొలుత స్వామినాథన్ చిత్రపటానికి నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. సభలో నాయకులు జె.రామారావు, డి.రమేష్‌బాబు, ఎన్.శివప్రసాద్, సుభాని, ఎం.వెంకటేశ్వర్లు, బి.భోగేశ్వరరావు, జవహర్‌రాణి, సిహెచ్.యానాదులు, ఎం.రమణ, గాలీబు, ఎన్.పుర్ణచంద్రరావు, కె.వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



గుంటూరులో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు



పెదనందిపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు



విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్ వైద్య శిబిరం

ప్రజాశక్తి-మంగళగిరి

విజయ హెల్త్ కేర్ ట్రస్ట్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాత మంగళగిరిలోని క్లిన్ వద్ద ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. దీర్ఘకాల వ్యాధులైన షుగర్ బీపీ, థైరాయిడ్, రక్తహీనత, కీళ్లవాతం సాధారణ బలహీనత వంటి జబ్బులకు డాక్టర్ గోవిందరాజు ఉచితంగా పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులను రూ.300కు అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.మహేష్, యు.శ్రీనివాస్, ఎ.శివాజీ, నరసింహారావు, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ బి.రమేష్, కె.శ్యామ్, ఎన్.నాగబాబు, పాల్గొన్నారు.



కెవిఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు : కెవిఆర్ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఆదివారం ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ కొమ్మెర్ల శివకుమార్‌ను అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, 32వ డివిజన్ కార్పొరేటర్ ఇ.వెంకటకృష్ణ (ఆచారి) అభినందించారు. ఫౌండేషన్ ద్వారా అనాథ పిల్లలకు, వృద్ధులకు, స్కూల్ పిల్లలకు సాయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బి.రవీంద్ర పాల్గొన్నారు.

కొనసాగుతున్న జగనన్న సురక్ష

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్యాధికారులు విధిగా పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు అన్నారు. గంగానమ్మపేట, సాలిపేట, పాండురంగపేట, చినరావూరు, పినపాడు-1 సచివాలయాల పరిధిలో ఆదివారం సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సేకరించిన నమూనాలను 5వ తేదీన నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలకు తేవాలని, వైద్యులు పరీక్షించి మందులిస్తారని చెప్పారు.

ప్రజలకు ఇబ్బందిగా ఉన్న డిస్‌ప్లే బోర్డుల తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు

రోడ్ల వెంబడి వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న మీడియా డివైజ్ డిస్‌ప్లే బోర్డ్‌ల తొలగింపునకు అందరూ సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. కమిషనర్ చాంబర్‌లో ఇటీవల జరిగిన రోడ్ సేఫ్టీ కమిటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు నగరంలో రోడ్ల వెంబడి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ప్రకటనల బోర్డులను పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు తొలగించారు. ప్రధాన రహదారుల వెంబడి వాహనదారులకు అసౌకర్యంగా ఉండే హోర్డింగ్‌లను తొలగిస్తామని, ఇందులో భాగంగా ఆదివారం కలెక్టరేట్, మెడికల్ క్లబ్, అమరావతి రోడ్ చిల్లీస్ జంక్షన్, జెకెసి కాలేజి రోడ్ జంక్షన్, ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ జంక్షన్, నాజ్ సెంటర్, టిబి బంగ్లాల వద్ద ఉన్న బోర్డులను తొలగింపజేశామని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటి ప్లానర్లు బాబు రావు, అజయ్ కుమార్, మురళి, టిపిఎస్‌లు, టిపిబిఓలు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



బోర్డులు తొలగిస్తున్న జిఎంసి సిబ్బంది

రాష్ట్రంలో నేరస్తుల స్వైర విహారం

- బడుగు, బలహీన వర్గాలను చంపుకుతింటున్న జగన్ ముఠా
- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ



ప్రజాశక్తి - గుంటూరు

రాష్ట్రంలో నేరస్తులు స్వైరవిహారం చేస్తున్నారని, బడుగు, బలహీన వర్గాలను జగన్ ముఠా చంపుకుతింటోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నాయకులు మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. రేపల్లె నియోజకవర్గంలో అమర్నాథ్‌గౌడ్ అనే పదో తరగతి విద్యార్థిని వైసిపి నేతల ప్రోద్బలంతో కొందరు హత్యచేయగా ఆ పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబు అతని వద్ద డ్రైవర్‌గా పనిచేసి మానేసిన సుబ్రహ్మణ్యంను కొట్టి చంపారని అన్నారు. వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణ కోరిన జగన్ అనంతరం ఆ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని అన్నారు. ఆయా ఘటనల్లో మృతుల కుటుంబీకులు ఆవేదనతో, ఆర్తనాదాలు చేస్తూ కోర్టుల చుట్టూ తిరుగుతుంటే హంతకులు మాత్రం డాన్సులు చేస్తూ యథేచ్ఛగా తిరుగుతున్నారని మండిపడ్డారు. అమర్నాథ్ గౌడ్ హత్యకేసులో నిందితుడు వినాయక చవితి ఉత్సవాల్లో డ్యాన్సులు వేస్తూ కనిపించగా మరో నిందితుడు పాము వెంకటేశ్వరరెడ్డి బెయిల్‌పై బయటకొచ్చి, బాధిత కుటుంబంపై హత్యాయత్నం చేశాడని, ఎమ్మెల్సీ అనంతబాబును మొన్న జరిగిన వైసిపి ఎల్పీ సమావేశంలో పాల్గొన్నారని విమర్శించారు. వివేకానందరెడ్డి హత్యకేసులో అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు సీబీఐ అధికారులు వెళ్తే అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఏ తప్పు చేయని చంద్రబాబను అక్రమంగా అరెస్టు చేయించి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని 40 ఏళ్లు వెనక్కు నెట్టింది కాకా 'మళ్లీ జగనే కావాలి' అంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని మోహనకృష్ణ దుయ్యబట్టారు.



ఉపకారవేతనాలు అందిస్తున్న ఎం.హనుమంతరావు తదితరులు

510 మందికి ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటి 40వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక మార్కండేయ కళ్యాణ మండపంలో పేద చేనేత విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ 40 ఏళ్ల నుండి పేద చేనేత కుటుంబాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ విద్యావకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 510 మందికి రూ.15.42 లక్షలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటి కార్యదర్శి పి.రాజశేఖర్, రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, సొసైటి సభ్యులు డి.కుబేరస్వామి, జె.బాబుశివప్రసాద్, ఎం.లక్ష్మీనారాయణ, ఎ.వెంకటేశ్వరరావు, వి.సురేష్ కుమార్, కె.వి రాజశేఖర్, కన్నా మాస్టారు పాల్గొన్నారు.

వైసిపి డాక్టర్ల విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా నరేష్



ప్రజాశక్తి - మంగళగిరి

వైసిపి డాక్టర్ల విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా మంగళగిరి పట్టణానికి చెందిన కొల్లి నరేష్‌ను నియమించారు. నరేష్ 104లో జిల్లా కో-ఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షు అశోక్‌రెడ్డికి నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గాంధీ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో పెదనందిపాడు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కోదండరామిరెడ్డి, రమణయ్య ఆదివారం తెలిపారు స్థానిక సాయి మందిర్, వాసవి వనిత క్లబ్, కాకతీయ యూత్, చేయూత సేవా సంఘం, టైలర్స్ అసోసియేషన్ సౌజన్యంతో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు క్లబ్ కోశాధికారి ఎన్‌విఎస్ నాగేశ్వరరావు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కార్డులు అందజేత

ప్రజాశక్తి-తెనాలి

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అందిస్తున్న ఆరోగ్య బీమా కార్డు పేదవర్గాలకు ఓ వరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్షులు డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. పెదరావూరుకు చెందిన పెన్నీ మినిస్ట్రీస్ అధ్యక్షులు దిలీప్ రాజా ఆధ్వర్యంలో పేదలకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా ఉచిత రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని కార్డులు అందించారు. స్థానిక సుల్తానాబాద్ రత్నాఫార్చ్యూన్ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 300కు పైగా కార్డులు పొందారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా రూ.5 లక్షల విలువైన బీమా ఈ కార్డుద్వారా లభిస్తుందని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఐసియు సదుపాయం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్, రోటర్ క్లబ్ అధ్యక్షులు ఈదర వెంకటపూర్ణచంద్, కామన్ సర్వీస్‌సెంటర్ నిర్వాహకులు డి.శివనారాయణ, పి.రాజేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం రద్దు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా, గుంటూరు సిటి

జిల్లా కలెక్టరేట్, పోలీస్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' గ్రీవెన్స్‌ను ఈ సోమవారం రద్దు చేసినట్లు ఆయా కార్యాలయాల అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. మహాత్మా గాంధీ జయంతి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రీవెన్స్‌కు ప్రతివారం సుదూర ప్రాంతాల నుండి ప్రజలు వస్తారని, వీరంతా ఈ సోమవారం గ్రీవెన్స్‌ను రద్దు చేసిన విషయాన్ని గమనించాలని గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ కోరారు.



ప్రచారంలో వివా-వివిఐటి విద్యార్థులు

నంబూరులో వివా-వివిఐటి విద్యార్థుల పారిశుధ్య కార్యక్రమాలు, మానవహారం

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆదివారం వివా-వివిఐటి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మండంలలోని నంబూరు గ్రామపంచాయతీ సిబ్బందితో కలసి శ్రమదానం చేశారు. పారివుధ్య ప్రాధాన్యంపై ప్రచారంలో భాగంగా మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై ప్రదర్శన చేసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని విద్యార్థులు, గ్రామస్తులతో స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. కార్యదర్శి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని, కాలుష్య రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని అన్నారు. కార్యక్రమంలో వివా - వివిఐటి అధ్యాపకులు పి.మహమ్మద్ ఖాన్, అధ్యాపకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యాధి నిరోధక టీకాలు

- వ్యాధి రాకముందే జాగ్రత్తలు ముఖ్యం
- 16 ఏళ్లు వచ్చేవరకూ డోసులు
- ప్రజాశక్తితో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లక్ష్మానాయక్





ఐదేళ్ల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ముమ్మరంగా జరుగుతున్నట్టు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ భూక్యా లక్ష్మా నాయక్ తెలిపారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రాం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచేందుకు కృషి చేస్తున్నామన్న ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలిపారు.

జిల్లా జనాభా, వారిలో చిన్నారులు ఎంతమంది?

జిల్లా జనాభా 23 లక్షలు కాగా ఇందులో ఐదేళ్లలోపు చిన్నారులు దాదాపు 1,45,000 మంది ఉన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ వయసు నుండి ఐదేళలలోపు పిల్లలకు అందరికీ తొమ్మిది రకాల వ్యాధి నిరోధక టీకాలను అందిస్తున్నాం. టీకాల ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతోంది.

ఏయే టీకాలు, ఎప్పుడువేయించాలి?

జాతీయ వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమంలోనే గర్భిణులకు టిడి టీకాలు మూడు డోసులు ఇస్తాం. గర్భిణిగా ఉన్నప్పుడు నాలుగో నెల నుండి నెల రోజుల గ్యాప్‌తో మూడు డోస్‌ల టిడి వ్యాక్సిన్ ఇస్తారు. డెలివరీ తరువాత తొలి దశలో తల్లి, బిడ్డలకు ధనుర్వాతం రాకుండా టీకా వేయించడం ద్వారా ఇరువురికి కాపాడగలుగుతాం. ముఖ్యంగా మిషన్ ఇంద్రధనస్సు అనే ప్రోగ్రామ్ ద్వారా దశలవారీగా ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాలన్నీ కూడా ఇస్తూ ప్రజలలో వీటిపై అవగాహన కల్పిస్తున్నాం. వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్‌ను బట్టి అప్పుడే పుట్టిన శిశువు (ఫస్ట్ డే) వయసు వారికి ఓపివి '0' డోస్ వేస్తారు. అదే రోజు బీసీజీ అనే వ్యాక్సిన్ కూడా ఇస్తారు. హెపటైటిస్ బి కూడా అదే రోజు ఇస్తారు. ఆ తర్వాత ఆరువారాల వయస్సు ఉన్నప్పుడు ఓరల్ పోలియో ఒక డోస్, ఆర్‌వివి ఒక డోసు, ఎఫ్ఐపిబి ఒక డోస్, పెంటావాలెంట్ మొదటి డోసు, పిసివి డోస్ ఇస్తారు. అదేవిధంగా 10 వారాల వయసు లో ఓరల్ పోలియో వ్యాక్సిన్ రెండో డోసు, ఆర్‌వివి రెండో డోసు, పెంటావాలంట్ రెండవ డోసు ఇవ్వాలి. ఆ తర్వాత 14 వారాల వయస్సులో ఓరల్ పోలియో వ్యాక్సిన్ మూడో డోసు, ఆర్‌వివి మూడవ డోస్, ఎఫ్ఐపివి రెండవ డోసు, పెంటావాలెంట్ మూడోవ డోసు, పిసివి రెండవ డోస్ ఇస్తారు. 9 నుంచి 12 నెలల మధ్య వయస్సులో బిడ్డకు ఎంఆర్ మొదటి డోస్, పిసివి బూస్టర్ డోస్ మొదటి డోసు ఇస్తాం. 16-24 నెలల మధ్య ఆ బిడ్డకు ఓపివి బూస్టర్ బూస్టర్ డోర్ డోసు ఇస్తాం.

గరిష్టంగా ఎన్నేళ్ల వరకు టీకాలు ఇస్తారు?

16 ఏళ్ల వయస్సు వచ్చే వరకు వివిధ రకాల టీకాలు అందిస్తున్నాం. బిడ్డ వయస్సు ఐదు నుండి ఆరేళ్ల మధ్య ఉన్నప్పుడు ఆ బిడ్డకు ఇవ్వాల్సిన టీకాలలో డిపిటి బూస్టర్ డోస్ రెండవది ముఖ్యమైంది. మొత్తంగా పిల్లల విషయంలో వ్యాధి వచ్చిన తరువాత చికిత్స చేయించుకోవడం కంటే వ్యాధి రాకుండా జాగ్రత్తలు పడటమే ఎంతో ముఖ్యం. అంటే వ్యాధులు వచ్చినప్పుడు శారీరకంగా ఆర్థికంగా ఇబ్బందులు పడటం కంటే ముందే అవి రాకుండా వాటి నివారణ కోసం ప్రివెంటివ్ పర్పస్ వ్యాక్సిన్స్ తీసుకోవడం ద్వారా శరీరంలో డిఫెన్స్ మెకానిజాన్ని పెంచడం కోసం ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ఎంతో ముఖ్యం. అప్పుడే పుట్టిన బిడ్డ వయసు నుండి ఐదేళ్లలోపు తొమ్మిది రకాల వ్యాధి నిరోధక టీకాలను ఇవ్వడం ద్వారా రోగ నిరోధక శక్తిని పెంచి సమాజంలో రాబోయే కాలంలో వారి సంపూర్ణ ఆరోగ్యానికి పునాది వేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆ తర్వాత 10 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల మధ్య వయసులో ఉన్నప్పుడు వేయవలసిన టీకాలు అదేవిధంగా కౌమార దశలో ఉన్నవారికి రోగ నిరోధకత కోసం టిడి (డిఫ్తీరియా నుండి రక్షించుటకు) వ్యాక్సిన్ ఇస్తారు.

జిల్లా స్థాయిలో ఎవరు పర్యవేక్షిస్తారు?

జాతీయ వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రాం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుంటారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు టీకాల కార్యక్రమంలో కీలక భూమిక పోషిస్తారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రేపటి నుండి సాధారణ బీమా పెన్షనర్ల ఉద్యమం

ఆఖరి నెల జీతంలో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్‌గా ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

సాధారణ బీమా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుండి ఆందోళనలు చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాధారణ బీమా పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.వి.సుబ్బారావు తెలిపారు. ఆదివారం స్థానిక అమరావతి రోడ్డు, నవీన పాఠశాల సమావేశం మందిరంలో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జనరల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ అంకయ్య అధ్యక్షత వహించగా పివి సుబ్బారావు మాట్లాడారు. జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ పట్ల కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ తీవ్ర వివక్ష చూపుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకింగ్, ఎల్ఐసి తదితర ఆర్థిక సంస్థల ఉద్యోగులకు ఆఖరి నెల జీతంలో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్‌గా అందచేస్తున్న కేంద్ర ఆర్థిక శాఖ సాధారణ బీమా ఉద్యోగులకు 15 శాతమే అనుమతించి అన్యాయం చేస్తోందని విమర్శించారు. ప్రతి ఐదేళ్లకు కేంద్ర ప్రభుత్వ బ్యాంకింగ్ ఎల్ఐసి తదితర ఉద్యోగుల వేతన సవరణ జరిగినట్లు పెన్షనర్లకు కూడా పెన్షన్ అప్డేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ఆందోళన కార్యక్రమాలు దశల వారీగా ఉద్యమ కార్యాచరణ రూపొందించుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోలమన్‌రాజు, అమరావతి యూనిట్ కార్యదర్శి ఎం.సాంబశివరావు, కోశాధికారి కృష్ణారావు, రాష్ట్ర నలుమూలల నుండి వివిధ జిల్లాల నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పుస్తక పఠనంతో విద్యార్థులకు బంగారు భవిష్యత్

ప్రజాశక్తి - పెదనందిపాడు

పుస్తక పఠనం వల్ల మానసిక ఉల్లాసంతోపాటు విషయ పరిజ్ఞానం పెరుగుతుందని ఎస్టీయు నాయకులు జి.మోహనరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం 'చదువు అంటే మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. అశోక హైస్కూల్ డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, నీతి కథల ద్వారా నైతిక విలువలు అలవడతాయని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు పి.సుభాషిణి, స్థానికులు మంజుల, వంశి, ఎస్.వెంకటేశ్వర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న విజ్ఞాన్ విద్యార్థులు

విజ్ఞాన్స్ విద్యార్థుల స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని యూఈఏసీ (యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ కౌన్సిల్) ఆధ్వర్యంలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం యూనివర్సిటీ దత్త గ్రామమైన వడ్లమూడిలో స్వచ్ఛత హీ సేవా, వైద్య శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గురించి వివరించారు. వైరల్, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు తెలిపారు. అనంతరం గ్రామంలోని రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. అమరావతి హాస్పిటల్ డాక్టర్ శివ రత్నాకర్ ఆధ్వర్యంలోని వైద్య బృందం సహాయంతో గ్రామస్తులకు రక్త పరీక్షలతో పాటు బీపీ వంటి ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, యూఈఏసీ ప్రోగ్రామ్ ఆఫీసర్, కో-ఆర్డినేటర్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటోలతో డ్రైవర్ల ర్యాలీ



ప్రజాశక్తి-గుంటూరు : సిఎం జగన్మోహన్‌రెడ్డి వాహన మిత్ర నిధులు విడుదల చేసినందుకు నగరంలోని ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుండి నిర్వహించిన ర్యాలీని మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, ముస్తఫాతో కలిసి మేయర్ ప్రారంభించారు. వాహన మిత్ర ద్వారా డ్రైవర్ల ఖాతాల్లో వరుసగా ఐదోసారి రూ.10 వేలు జమ చేశారన్నారు.